www.prajasakti.com
ప్రజాశక్తి
శనివారం 19 ఏప్రిల్ 2025
5
పశ్చిమ గోదావరి



లోవోల్టేజీ సమస్య పరిష్కరించాలని వినతి

ప్రజాశక్తి - పెనుమంట్ర



ఎంఎల్‌ఎ పితానికి వినతిని అందజేస్తున్న కాలనీ వాసులు

మండలంలోని మార్టేరు గ్రామం కోడేరు రోడ్డు కొత్త కాలనీలో గత కొంతకాలంగా కరెంటు లోవోల్టేజ్‌తో ఏర్పడ్డ సమస్యలను తొలగించాలని కోరుతూ కాలనీ వాసులు వినతిపత్రాన్ని శుక్రవారం మాజీ మంత్రి, ఆచంట ఎంఎల్‌ఎ పితాని సత్యనారాయణకు ఆ కాలనీ వాసులు వినతిని అందజేశారు. విద్యుత్ లోవోల్టేజీ వల్ల గృహోపకరణాలు పాడవుతున్నాయని, ఈ సమస్యపై కరెంటు సబ్ స్టేషన్ వారికి ఎన్నిసార్లు విన్నవించుకున్నా పట్టించుకోవడం లేదని వారు ఎంఎల్‌ఎకు ఫిర్యాదు చేశారు. దీనిపై స్పందించిన ఎంఎల్‌ఎ సమస్యను సత్వరం పరిష్కరిస్తానని వారికి హామీ ఇచ్చారు.

రైతు సమస్యల పరిష్కారమే లక్ష్యం

ఉంగుటూరు ఎఎంసి ఛైర్‌పర్సన్ కారేటి జ్యోతి



ప్రజాశక్తి - ఉంగుటూరు

'దేశానికి రైతే వెన్నెముక.. అలాంటి రైతు సమస్యల పరిష్కారానికి ఎఎంసి ఛైర్‌పర్సన్ రూపంలో నాకు దక్కిన అవకాశంగా భావిస్తున్నాను. మా కుటుంబానికి వ్యవసాయమే ఆధారం. వ్యవసాయ నేపథ్యం నుంచి వచ్చిన నాకు ఉంగుటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్‌పర్సన్‌గా పదవి దక్కడం చాలా సంతోషంగా ఉంది. ఎంఎల్‌ఎ పత్సమట్ల ధర్మరాజు సిఫార్సుతో దక్కిన ఈ పదవికి న్యాయం చేస్తాను. ఈ రంగంపై మరింత అవగాహన పెంచుకుని నిరంతరం రైతుసేవలో ఉంటూ ఆదర్శ ఎఎంసి ఛైర్‌పర్సన్‌గా గుర్తింపు దక్కేలా అందరి సహకారంతో కృషి చేస్తా' అని ఇటీవల ఉంగుటూరు ఎఎంసి ఛైర్‌పర్సన్‌గా నియమితులైన కారం జ్యోతి తెలిపారు. త్వరలోనే ఆమె బాధ్యతలు చేపట్టనున్న నేపథ్యంలో ఆమె ప్రజాశక్తికి ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో పలు వెల్లడించారు.



ఎఎంసి కార్యాలయం భవనం నిర్మాణం కోసం సేకరించిన భూమి ఇదే..

ప్రశ్న: మీ కుటుంబం, చదువు వివరాలు చెబుతారా?

ఛైర్‌పర్సన్: మాది ఉంగుటూరు మండలం నాచుగుంట పంచాయతీ కొత్తగూడెంలో రైతు కుటుంబం. అమ్మ, నాన్న, అన్నయ్య ఉన్నారు. వ్యవసాయ కుటుంబం. మాది ప్రేమ వివాహం. జనసేన పార్టీ ఆవిర్భావం నుంచి ఆ పార్టీలో కీలక నాయకునిగా ఉన్న సూరత్తుల మణికంఠ శ్రీనివాస్ (అయ్యప్ప) నా భర్త. ఉంగుటూరు ఎఎంసి బిసి మహిళకు రిజర్వు చేసిన నేపథ్యంలో కూటమి ప్రభుత్వం నన్ను ఛైర్‌పర్సన్‌గా నియమించడం నా భర్త అయ్యప్ప జనసేన పార్టీ విజయానికి చేసిన కృషికి నిదర్శనంగా భావిస్తున్నా. నేను బికాం కంప్యూటర్ చదివాను.

ప్రశ్న: చిన్న వయస్సులోనే ఎంతో కీలకమైన ఎఎంసి ఛైర్‌పర్సన్ పదవిని సమర్థవంతంగా నిర్వహించేందుకు ఎలాంటి కార్యాచరణ చేపట్టబోతున్నారు.

ఛైర్‌పర్సన్: నా వయస్సు 23 సంవత్సరాలు. అతి చిన్న వయస్సులో ఈ పదవిని అందుకున్న మహిళగా గర్విస్తున్నాను. అయినప్పటికీ నేటి రాజకీయ, సామాజిక పరిస్థితులపై కొంత అవగాహన ఉంది. ముఖ్యంగా వ్యవసాయ రంగంపై ప్రత్యేక శ్రద్ధ చూపి రైతులకు ఎలాంటి సేవలందించాలనే దానిపై మరింత అవగాహన పెంపొందించుకుంటూ అందరికీ ఆమోదయోగ్యమైన అభివృద్ధిని సాధించేందుకు నా శాయశక్తులా కృషి చేస్తాను. నా ప్రతి పనిలోనూ నా భర్త మార్గదర్శిగా ఉంటారు.

ప్రశ్న: ఛైర్‌పర్సన్‌గా పగ్గాలు చేపట్టాక ఏయే పనులపై దృష్టి సారిస్తారు?

ఛైర్‌పర్సన్: ఉంగుటూరు ఎఎంసికి సొంత కార్యాలయం లేదు. చేబ్రోలులో అద్దె భవనంలో నిర్వహిస్తున్నారు. ఉంగుటూరులో 2018లో టిడిపి హయాంలోనే భూసేకరణ చేశారు. అందులో రూ.50 లక్షలతో భవనం, మార్కెట్ యార్డు నిర్మాణానికి పరిపాలనాపరమైన అనుమతులు వచ్చాయి. ఆ తర్వాత వైసిపి హయాంలో టెండర్లు పిలిచినా ఎవరూ ముందుకు రాలేదు. కూటమి ప్రభుత్వంలో టెండర్ రీషెడ్యూల్, రీఎస్టిమేట్ వేయించి అన్ని అనుమతులు తీసుకొచ్చి సొంత భవనం, కాంపౌండ్ వాల్ నిర్మించాలనేదే నా మొదటి ప్రాధాన్యత.

ప్రశ్న: పుంత రోడ్లను అభివృద్ధి చేసే ఆలోచన ఉందా?

ఛైర్‌పర్సన్: ఎంఎల్‌ఎ పత్సమట్ల ధర్మరాజు ఇప్పటికే నియోజకవర్గంలో అన్ని పుంత రోడ్లను పటిష్టం చేసేందుకు ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపించారని తెలిసింది. ఉంగుటూరు ఎఎంసి పరిధిలోని ఉంగుటూరు, నిడమర్రు, గణపవరం మండలాల్లో సుమారు 60 పుంత రోడ్లను రూ.6 కోట్లతో నిర్మించేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. కచ్చితంగా వాటిని నిర్మిస్తాం.

ప్రశ్న: సామూహిక ధాన్యం కల్లాలు ఏర్పాటుపై దృష్టి సారిస్తారా?

ఛైర్‌పర్సన్: చాలాచోట్ల ధాన్యం ఆరబెట్టేందుకు కల్లాలు లేక రోడ్లు, పుంతలు, శ్మశానాల వెంబడి ఆరబెట్టుకోవడం నిజమే. చాలాచోట్ల పుంత రోడ్లు ఆక్రమణకు గురయ్యాయి. అలాంటి వాటిని గుర్తించి వాటిని కల్లాలుగా రూపొందించేలా ఆలోచన చేస్తాం.

ప్రశ్న: ఉంగుటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆదాయ వివరాలు చెప్పండి?

ఛైర్‌పర్సన్: జాతీయ రహదారి చెక్‌పోస్టులు, ఉప్పాకపాడు, వెల్లమిల్లి, నారాయణపురంలో చెక్‌పోస్టుల ద్వారా ధాన్యం, చేపలు, ఆపరాలపై సెస్ రూపంలో ఆదాయం సమకూరుతోంది. ధాన్యం, చేపలపై సుంకాన్ని వసూలు చేస్తున్నారు. ఈ లెక్కన 10 టన్నుల ధాన్యం లారీకి సెస్ కింద రూ.4600, అదే చేపల లారీకి రూ.5 వేలు, 12 చక్రాల చేపల లారీకి రూ.6 వేలు చొప్పున ఎఎంసికి ఆదాయం వస్తోంది. 2019-20 ఆర్థిక సంవత్సరానికి రాబడి లక్ష్యం రూ.2.86 కోట్లు అంచనా వేయగా లక్ష్యాన్ని దాటి రూ.4.19 కోట్ల ఆదాయం ఆర్జించింది. 2024-25లో రూ.6.40 కోట్ల ఆదాయం ఆర్జించింది. ఆక్వా రవాణాకు నారాయణపురం ముఖద్వారంగా ఉండటం వల్ల సెస్ ఆదాయం బాగానే ఉంటోంది.

ప్రశ్న: చివరిగా మీరిచ్చే సందేశం?

ఛైర్‌పర్సన్: ఉంగుటూరు ఎఎంసిని జిల్లాలో ఆదర్శనీయంగా తీర్చిదిద్దేందుకు ఎంఎల్‌ఎ పత్సమట్ల ధర్మరాజు, కమిటీ సభ్యులు, అధికారులు, రైతుల సహకారంతో కార్యాచరణ ప్రణాళిక రూపొందించి అమలు చేస్తాను.



చేబ్రోలులో అద్దె ఇంట్లో కొనసాగుతున్న ఎఎంసి కార్యాలయం

ఉంగుటూరు ఎఎంసి నేపథ్యం

తాడేపల్లిగూడెం వ్యవసాయ మార్కెట్ కమిటీ నుంచి ఉంగుటూరు ఎఎంసిగా 1997లో వేరుపడి ఉంగుటూరు, నల్లజర్ల మండలాలు కలిశాయి. అనంతరం విభజనలో దీని పరిధిలోకి ఉంగుటూరు, నిడమర్రు, గణపవరం మండలాలను కలిపారు. ఎఎంసి ఛైర్మన్లుగా కాజ సోమశేఖర్ (టిడిపి), తాతిన సత్యనారాయణ (టిడిపి), కొండ్రెడ్డి సర్వేశ్వరరావు (కాంగ్రెస్), పాతూరి విజయకుమార్ వ్యవహరించారు. 2017 నుంచి మార్కెట్ కమిటీకి ఛైర్మన్ లేక అధికారుల పాలనలో సాగింది. వైసిపి అధికారంలోకి వచ్చాక నామినేటెడ్ పదవులను భర్తీ చేయడంతో బిసి మహిళకు రిజర్వు అయ్యింది. వైసిపి నేత మరడ వెంకట మంగారావు భార్య రమావతి రెండు పర్యాయాలు ఎఎంసి ఛైర్‌పర్సన్‌గా పని చేశారు. పాలకవర్గంలో స్థానిక ఎంఎల్‌ఎ ధర్మరాజు గౌరవ ఛైర్మన్‌గా ఉంటారు. 18 మంది డైరెక్టర్లు, ఒక వైస్ ఛైర్మన్ మొత్తం 20 మందితో ఎఎంసి పాలకవర్గ కొలువుదీరనుంది.

ఆదాయమున్నా.. అద్దె భవనంలోనే పాగా

ఏడాదికి రూ.4 కోట్లు నుంచి రూ.6 కోట్లు వరకూ ఆదాయం వస్తున్నా ఉంగుటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీకి సొంత కార్యాలయం, సొంత గిడ్డంగులు లేవు. గత పాలకులు పట్టించుకోకపోవడంతో వచ్చిన ఆదాయంలో సగం కార్యాలయ అద్దెలకే సరిపోయేది. పొలాల్లోంచి వ్యవసాయ ఉత్పత్తులు బయటకు వచ్చేందుకు అవసరమైన పుంత రోడ్లు, సామూహిక కల్లాలు ఏర్పాటుకు ప్రాంతాలను గుర్తించారు. తరచూ పశువైద్య శిబిరాలను నిర్వహించి పాడిరైతులను ఆదుకునేలా కృషి చేయాల్సి ఉంది.

ఉపాధి కూలీల బకాయి వేతనాలు చెల్లించాలి

సమస్యల పరిష్కారం కోరుతూ 22న కలెక్టరేట్ వద్ద ధర్నా
ఎపి వృకాస జిల్లా కార్యదర్శి జక్కంశెట్టి సత్యనారాయణ

ప్రజాశక్తి - అత్తిలి

ఉపాధి హామీ కూలీల సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 22న భీమవరం కలెక్టరేట్ వద్ద నిర్వహించబోయే మహాధర్నాలో కూలీలు పెద్దసంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఎపి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి జక్కంశెట్టి సత్యనారాయణ, ఎపి కౌలురైతుల సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కేతా గోపాలన్ పిలుపునిచ్చారు. అత్తిలి మండలం దంతుపల్లిలో పని చేస్తున్న కూలీలను కలిసి ఉపాధి హామీ పనుల్లో ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సత్యనారాయణ, గోపాలన్ మాట్లాడుతూ కేంద్రంలో బిజెపి, రాష్ట్రంలో కూటమి ప్రభుత్వాలు ఉపాధి హామీ కూలీల పట్ల అవలంబిస్తున్న విధానాలను తిప్పికొట్టేందుకు కూలీలంతా ఐక్యంగా ఉపాధి హామీ పరిరక్షణకు సిద్ధం కావాలన్నారు. కేంద్రంలో బిజెపి ప్రభుత్వం తెచ్చిన రెండు పూటలా పని, ఆన్‌లైన్ మస్టర్ విధానాలు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. బకాయి వేతనాలు వడ్డీతో కలిపి కూలీలకు చెల్లించాలన్నారు. మొగల్తూరులో ప్రమాదంలో మృతి చెందిన కూలీల కుటుంబాలకు రూ.10 లక్షలు నష్టపరిహారం చెల్లించి కూలీల కుటుంబాలను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం ఆరవల్లి గ్రామానికి చెందిన కీర్తిశేషులు వీరవల్లి గణేశ్వరరావు కుటుంబ సభ్యుల ఆర్థిక సహాయంతో 200 మంది ఉపాధి కూలీలకు మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వ్యకాస జిల్లా సహాయ కార్యదర్శి బళ్ల చిన వీరభద్రరావు, నాయకులు వనం రాంబాబు, బి.ఉమాదేవి, కె.లక్ష్మి, జి.ఆశ, ఎస్.లక్ష్మీదుర్గ, పి.నాగదుర్గ, పి.రేవతి, బి.నాగలక్ష్మి, కెకె.కుమారి, పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

తాడేపల్లిగూడెం: ఉపాధి హామీ సమస్యల పరిష్కారం కోరుతూ ఈ నెల 22న భీమవరం కలెక్టరేట్ వద్ద జరిగే మహాధర్నాకు పెద్దఎత్తున ఉపాధి కూలీలు తరలిరావాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కండెల్లి సోమరాజు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా శుక్రవారం కొత్తూరులో ఉపాధి పని ప్రదేశంలో ఆయన కూలీలతో మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీ పనులకు నిధులు తగ్గిస్తూ కొత్త కొత్త నిబంధనలను పెట్టి కూలీలకు ఉపాధి దూరం చేస్తోందని విమర్శించారు. అనేక పోరాటాల ద్వారా సాధించుకున్న చట్టం ఇదని, ఎవరో పెట్టిన భిక్ష కాదని, దీన్ని కాపాడుకోవటం కోసం కూలీల ఉద్యమించాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కండెల్లి బాబూరావు, మోర్ప జ్యోత్స్న, చింతాడ గ్రేసులత, మారంపూడి అనిత తదితరులు పాల్గొన్నారు.

పెనుగొండ: ఉపాధి పనుల బకాయిలు వెంటనే చెల్లించాలని ఎపి



అత్తిలి: దంతుపల్లిలో 22న కలెక్టరేట్ వద్ద ధర్నా కరపత్రం ఆవిష్కరించిన నేతలు

వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి షేక్ పాదుషా డిమాండ్ చేశారు. శుక్రవారం మునమర్రులో ఉపాధి పనులు చేస్తున్న ప్రాంతానికి వెళ్లి ఆయన కూలీలతో మాట్లాడారు. వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం పాదుషా మాట్లాడుతూ చేతులు, కాళ్లల్లో గాజు పెంకులు గుచ్చుకొని బాధపడుతున్న కార్మికులకు ప్రథమ చికిత్స చేసే కిట్ అందుబాటులో ఉంచాలని, వైద్యం ప్రభుత్వమే చేయించాలని కోరారు. తాగునీరు, నీడ వసతి కల్పించాలని, బకాయి వేతనాలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ నెల 22న మంగళవారం జిల్లా కలెక్టరేట్ వద్ద ధర్నాలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సంఘం నేత కౌరు జగన్నాథం, సిఐటియు నాయకులు ఎస్.వెంకటేశ్వరరావు, ఉపాధి కూలీలు పాల్గొన్నారు.

భీమవరం టౌన్: ఉపాధి హామీ బకాయిలు వెంటనే విడుదల చేయాలని సిఐటియు మండల కార్యదర్శి ఇంజేటి శ్రీనివాస్ డిమాండ్ చేశారు. శుక్రవారం భీమవరం రూరల్ మండలం వెంపలో ఉపాధి హామీ పని ప్రాంతానికి వెళ్లి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పలువురు కూలీలు రెండు నెలలుగా తమకు సొమ్ము రాలేదని వాపోయారు. దీంతో రోజువారీ ఖర్చులకూ తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని చెప్పారు. దీనిపై శ్రీనివాస్ మాట్లాడుతూ ఉపాధి హామీ చట్ట ప్రకారం 15 రోజులకు ఒకసారి వేతనాలు పడాలని ఉన్నప్పటికీ రెండు నెలలుగా వేతనాలు పడకపోవడం వల్ల కూలీలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ఇప్పటికైనా బకాయిలు చెల్లించాలని, సమ్మర్ అలవెన్స్ పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. మెడికల్ కిట్ అందుబాటులో ఉంచాలని కోరారు. వ్యాన్ దూసుకెళ్లడంతో మొగల్తూరులో మృతి చెందిన ఉపాధి కూలీల కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఉపాధి కార్మికులు భూపతి సామేలు, వేంద్ర వెంకటలక్ష్మి, అమ్మాజీ, మార్తమ్మ తదితరులు పాల్గొన్నారు.

పేదోడి కళ్లల్లో ఆనందమే పవన్ లక్ష్యం

మంత్రి కందుల దుర్గేష్

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

ప్రతి పేదోడి కళ్లల్లో ఆనందం చూడటమే జనసేన అధినేత, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ లక్ష్యమని రాష్ట్ర సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. ప్రభుత్వ విప్, ఎంఎల్‌ఎ బొలిశెట్టి శ్రీనివాస్ నివాసం వద్ద శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా పెంటపాడు మండలం నుంచి ఎనిమిది మంది వైసిపి ఎంపిటిసిలు జనసేనలో చేరారు. ఈ సందర్భంగా వారిని పార్టీలోకి ఆహ్వానించిన మంత్రి దుర్గేష్ మాట్లాడుతూ గత వైసిపి ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలతో సాగిందని విమర్శించారు. అందరికీ సంక్షేమ ఫలాలు అందించేలా కూటమి పాలన సాగుతుందన్నారు. జిల్లాలో టెంపుల్ టూరిజం, ఎకో టూరిజం అభివృద్ధి చేసేందుకు ప్రణాళిక సిద్ధం చేశామని, దీనికి ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా కలెక్టర్ల నుంచి ప్రతిపాదనలు కోరామన్నారు. ఎంఎల్‌ఎ బొలిశెట్టి శ్రీనివాస్ మాట్లాడుతూ నియోజకవర్గంలో ఇటీవల జువ్వలపాలెం రోడ్డు, ముత్యాలమ్మ గుడికి వెళ్లే రోడ్డు, పెద్ద తాడేపల్లి నుంచి జగ్గంపేట వెళ్లే రోడ్ల నిర్మాణానికి రూ.20 కోట్ల నిధులు తీసుకొచ్చామని, పనులు త్వరితగతిన పూర్తి చేస్తామన్నారు. పట్టణంలో స్విమ్మింగ్ పూల్, ఇండోర్ స్టేడియం, జిల్లా పరిషత్ హైస్కూల్ గ్రౌండ్ తదితరాలు ప్రజల సహకారంతో అభివృద్ధి చేస్తామన్నారు. ఎర్రకాల్వపై మాధవరం-కంసాలిపాలెం మధ్య వంతెన నిర్మాణానికి త్వరలోనే టెండర్ల ప్రక్రియ పూర్తి చేసి పనులు ప్రారంభించేలా చర్యలు చేపడతామన్నారు. నియోజకవర్గ అభివృద్ధికి అంతా సహకరించాలని, ఎక్కడ అవినీతి జరిగినా సహించేది లేదని హెచ్చరించారు. ఉంగుటూరు ఎంఎల్‌ఎ పత్సమట్ల ధర్మరాజు మాట్లాడుతూ అభివృద్ధి అంటే ఏమిటో కూటమిపాలనలో చేసి చూపుతామన్నారు. అనంతరం ఎంపిటిసిలు దేవాబత్తుల నాగమణి, తోట నిరీక్షణరావు, దెయ్యం శ్రీనివాసరావు, చెంతన శారద, కె.దేవికారాణి, డి.సత్యనారాయణ, బొచ్చెల తాతారావు, నంద్యాల వెంకన్న బాబులకు మంత్రి దుర్గేష్, ఎంఎల్‌ఎలు బొలిశెట్టి శ్రీనివాస్, పత్సమట్ల ధర్మరాజు జనసేన కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో జనసేన నేతలు పుల్ల బాబీ, కసిరెడ్డి మధులత, మైలవరపు రాజేంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



జనసేనలో చేరిన ఎంపిటిసిలతో మంత్రి దుర్గేష్, ఎంఎల్‌ఎలు బొలిశెట్టి శ్రీనివాస్, పత్సమట్ల ధర్మరాజు, నేతలు

రోడ్ల పక్కన చెత్త వేస్తే చర్యలు: జెసి

ప్రజాశక్తి - భీమవరం టౌన్

దుకాణాలు నిర్వాహకులు రోడ్ల పక్కన, రోడ్ల కూడళ్లలో చెత్త వేస్తే చర్యలు తప్పవని జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్‌కుమార్‌రెడ్డి హెచ్చరించారు. శుక్రవారం ఆయన పట్టణంలో పలు ప్రాంతాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. పట్టణంలో ప్రభుత్వ ఏరియా హస్పటల్, కోర్టు ప్రాంతంలో రోడ్డు పక్కన కొబ్బరి బొండాలు, తాటి ముంజులు అమ్మే వారిని పలు ప్రశ్నలు అడిగారు. వీటిని వాడిన తరువాత వేస్ట్ అంతా ఎక్కడ వేస్తున్నారు, ప్లాస్టిక్ బ్యాగులను వాడుతున్నారా అంటూ మాట్లాడారు. అనంతరం వన్ టౌన్ పోలీస్ స్టేషన్ ఎదురుగా బ్రాహ్మణ అసోసియేషన్ సత్రం వద్ద ఖాళీ ప్రదేశాన్ని పరిశీలించారు. ఎటువంటి చెత్త వేయకుండా బోర్డు పెట్టాలని శానిటేషన్ ఇన్‌స్పెక్టర్‌ను ఆదేశించారు. మావుళ్లమ్మ గుడి వద్ద, కొత్త బస్టాండ్, మారుతి థియేటర్ ప్రాంతాల్లో పర్యటించారు. అక్కడ చెరుకు రసం అమ్మేవారిని, షాపులు, టెంపుల్ నిర్వాహకులు వేస్తున్న చెత్తను జాయింట్ కలెక్టర్ పరిశీలించారు. ఇక్కడ స్థానికంగా ఉన్న షాపులు వారు ఎవరైనా చెత్త వేసినట్లు తెలిస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని, ప్లాస్టిక్ వ్యర్థాలను వేయకూడదని అన్నారు. ఈ ప్రాంతాల్లో చెత్త నిషేధ బోర్డులు పెట్టి తరచూ పర్యవేక్షణ చేయాలని మున్సిపల్ అధికారులను, సిబ్బందిని జెసి ఆదేశించారు. జెసి వెంట మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ సిహెచ్.వెంకటేశ్వరరావు, శానిటేషన్ ఇన్‌స్పెక్టర్లు, మేస్త్రీలు, సిబ్బంది ఉన్నారు.



వ్యాపారితో మాట్లాడుతున్న జెసి

మత్స్యకారుల వివరాలు నమోదు

ప్రజాశక్తి - నరసాపురం

చేపల వేటపై నిషేధం నేపథ్యంలో అర్హులైన మత్స్యకారులను గుర్తించేందుకు బృందాలను ఏర్పాటు చేసి సర్వే చేపట్టినట్లు నరసాపురం మత్స్యశాఖ సహాయ సంచాలకులు ఎల్ఎన్ఎన్.రాజు తెలిపారు. శుక్రవారం నరసాపురం, మొగల్తూరు మండలాల్లో తీర ప్రాంత గ్రామాల్లో ల్యాండింగ్ పాయింట్ల వద్ద బృందాలను ఏర్పాటు చేసి సర్వే చేపట్టినట్లు వివరించారు. 1826 మంది మత్స్యకారుల నుంచి బ్యాంకు ఖాతా, ఆధార్ నంబర్లు, రేషన్ కార్డు, బోటు లైసెన్స్, రిజిస్ట్రేషన్ పత్రాలు తదితర వివరాలను సేకరించామన్నారు. ఈ నెల 19, 20, 21 తేదీల్లో వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేస్తామన్నారు. 22న అర్హుల జాబితా ఆయా పంచాయతీ కార్యాలయాల వద్ద నోటీసు బోర్డులో పెడతామన్నారు. 23న వివరాల జాబితాను జిల్లా కలెక్టర్, రాష్ట్ర అధికారులకు పంపిస్తామని, 26వ తేదీన మత్స్యకార భృతి రూ.20 వేలు లబ్ధిదారుల ఖాతాల్లో జమవుతుందని తెలిపారు.



మత్స్యకారుల వివరాలు నమోదు చేస్తున్న అధికారులు

చలివేంద్రాల ఏర్పాటు అభినందనీయం

మజ్జిగ చలివేంద్రాన్ని ప్రారంభించిన ఎంఎల్‌ఎ అంజిబాబు



మజ్జిగ పంపిణీ చేస్తున్న ఎంఎల్‌ఎ

భీమవరం టౌన్: వేసవిలో బాట సారుల కోసం మజ్జిగ చలివేంద్రాలను ఏర్పాటు అభినందనీయమని రాష్ట్ర పబ్లిక్ అకౌంట్స్ కమిటీ ఛైర్మన్, ఎంఎల్‌ఎ పులపర్తి రామాంజనేయులు(అంజిబాబు) అన్నారు. భీమవరం జెపి రోడ్డులోని శ్రీపద్మావతి వెంకటేశ్వర స్వామి దేవస్థానం వద్ద శుక్రవారం ఏర్పాటు చేసిన మజ్జిగ చలివేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ప్రతి ఏడాది వేసవిలో ప్రతిరోజు 40 లీటర్ల మజ్జిగ, మంచినీళ్ల చలివేంద్రం ఏర్పాటు గొప్ప విశేషమని అన్నారు. ఆలయ ధర్మకర్త, ఛైర్మన్ మంతెన రామ్ కుమార్ రాజు, ఆలయ ఇఒ ముదునూరి సత్యనారాయణ రాజు మాట్లాడుతూ దంతులూరి జగన్నాధరాజు నాల్గొవ కుమార్తె కీర్తిశేషులు అల్లూరి సూరయమ్మ వేసవిలో బాటసారుల దాహార్తి తీర్చడానికి చలివేంద్రం నిమిత్తం 3.94 సెంట్లు భూదానం చేసారని, దాత ఆశయాల మేరకు వేసవిలో ప్రతిరోజు 40 లీటర్ల మజ్జిగ, మంచినీళ్ల ఏర్పాటు చేస్తున్నామని అన్నారు. కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి కోళ్ల నాగేశ్వరరావు, జనసేన పట్టణ అధ్యక్షులు చెనమల్ల చంద్రశేఖర్, గంటా త్రిమూర్తులు, ఇఒ దండు వెంకటకృష్ణంరాజు, ఆలయ సిబ్బంది, అర్చకులు పాల్గొన్నారు.

పారిశుధ్యాన్ని క్రమబద్ధీకరించాలి

స్వర్ణ ఆంధ్ర-స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో ఎంఎల్‌ఎ ఆరిమిల్లి రాధాకృష్ణ



చెత్తను పరిశీలిస్తున్న ఎంఎల్‌ఎ

తణుకు : స్వర్ణ ఆంధ్ర-స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా ప్లాస్టిక్ నిషేధించి తద్వారా పారిశుధ్యాన్ని క్రమబద్ధీకరించాలని ప్రభుత్వం భావిస్తుంటే ప్రజల్లో ఇంకా మార్పు రావడం లేదని తణుకు ఎంఎల్‌ఎ ఆరిమిల్లి రాధాకృష్ణ ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం తెల్లవారుజామున మున్సిపల్ కమిషనర్ టి.రామ్‌కుమార్‌తో కలిసి ఎంఎల్‌ఎ రాధాకృష్ణ 24వ వార్డు కుమ్మర్ల వీధిలో పర్యటించారు. ఈ సందర్భంగా రోడ్డుపైనే స్థానికులు తమ ఇళ్లలోని చెత్తను తీసుకువచ్చి పారబోయడాన్ని గమనించి పలు సూచనలు చేశారు. తడిచెత్త, పొడిచెత్తను వేర్వేరుగా సేకరించడానికి సిబ్బంది ఇంటింటికీ వస్తున్నప్పటికీ వారికి ఇవ్వకుండా రోడ్డుపై పోస్తున్నారని అన్నారు. తణుకు పట్టణంలో నిత్యం దాదాపు 50 టన్నుల చెత్త వస్తోందని సిబ్బంది మాత్రం 180 మంది మాత్రమే ఉండటంతో క్షేత్రస్థాయిలో ఇబ్బందులు ఎదురౌతున్నాయన్నారు. ఈ పరిస్థితుల్లో ప్రజలు సహకరించి ఇంటింటికీ వచ్చే సిబ్బందికి చెత్తను ఇచ్చేలా ప్రతిఒక్కరూ సహకరించాలని కోరారు. ప్లాస్టిక్ నిషేధానికి ప్రతిఒక్కరూ సహకరించాలని సూచించారు. గతనెలలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు తణుకు పర్యటనలో ప్లాస్టిక్ నిషేధానికి పిలుపునిచ్చారని ఎంఎల్‌ఎ రాధాకృష్ణ గుర్తుచేశారు.

విద్యార్థులకు గోల్డ్ మెడల్, మెమొంటోలు అందజేత

కాళ్ల : ఇంటర్ ఫలితాల్లో కాళ్ల, కలిదిండి మండలాల్లో మండల ఫస్ట్ సాధించిన ఏలూరుపాడు జ్ఞానానంద జూనియర్ కాలేజీ విద్యార్థులు, 83 శాతం సాధించిన కాలేజీ విద్యార్థులను, యాజమాన్యాన్ని డిప్యూటీ స్పీకర్, ఉండి ఎంఎల్‌ఎ కనుమూరు రఘురామకృష్ణంరాజు శుక్రవారం అభినందించారు. వరుసగా మూడు సంవత్సరాలు కాళ్ల, కలిదిండి మండలాల్లో మండల ఫస్ట్ సాధించడం గొప్ప విషయమన్నారు. మండల ఫస్ట్ సాధించిన సీనియర్ బైపిసి విద్యార్థిని ఎస్.బ్లెస్సీ 957, ఎంపిసిలో ఎ.దుర్గా గణేష్ 891, సిఇసిలో జె.శ్రీలక్ష్మి 871 మార్కులు సాధించి కాలేజీ టాపర్లుగా నిలిచిన విద్యార్థులకు గోల్డ్ మెడల్, మెమొంటోలను ఎంఎల్‌ఎ చేతులమీదుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో కాలేజీ ప్రిన్సిపల్ ఎం.త్రిమూర్తిరాజు, కరస్పాండెంట్ డిజెఎస్ఆర్.శ్రీనివాస వర్మ, అకాడమిక్ డైరెక్టర్ డి.విజయకుమారి, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.



విద్యార్థికి మెమొంటోను అందజేస్తున్న డిప్యూటీ స్పీకర్ రఘు రామకృష్ణరాజు

కోవెల గుడిని అభివృద్ధి చేస్తాం

ప్రభుత్వ విప్ బొమ్మిడి నాయకర్

ప్రజాశక్తి - నరసాపురం



నాయకర్‌ను సన్మానిస్తున్న ఆలయ ఇఒ

పట్టణంలోని పురాతన ఆలయాలలో ఒకటైన శ్రీఆదికేశవ ఎంబర్ మెన్నారు స్వామి(కోవెల) అభివృద్ధికి కృషిచేస్తామని రాష్ట్ర ప్రభుత్వ విప్, ఎంఎల్‌ఎ బొమ్మిడి నాయకర్ అన్నారు. ఆదికేశవ ఎంబరు మెన్నారు స్వామి వారి బ్రహ్మోత్సవాల సందర్భంగా శుక్రవారం స్వామి వారిని ఎంఎల్‌ఎ నాయకర్ దర్శించుకున్నారు. ముందుగా ఆలయ ఇఒ రామచంద్ర కుమార్, ఆలయ ట్రస్ట్ బోర్డ్ వారి ఆధ్వర్యంలో ఎంఎల్‌ఎ నాయకర్‌కు పూర్ణ కుంభంతో, వేద మంత్రాలతో, ఆలయ మర్యాదలతో ఘనంగా స్వాగతం పలికారు. స్వామివారి దర్శనం అనంతరం తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆలయానికి సంబంధించిన పలు సమస్యలను ఎంఎల్‌ఎ దృష్టికి తీసుకురాగా ఎన్నో ఏళ్ల చరిత్ర కలిగిన శ్రీఆదికేశవ ఎంబర్ మెన్నారు ఆలయం(కోవెల)ను రాబోవు పుష్కరాల నాటికి అభివృద్ధి చేస్తామని తెలిపారు. ఆలయానికి ఉన్న సమస్యలపై దృష్టి సారిస్తామని ఈ సందర్భంగా ఎంఎల్‌ఎ నాయకర్ అన్నారు. ఈ కార్యక్రమంలో ఛైర్మన్ పుప్పాల వెంకటకృష్ణ, ఇఒఆర్ వివిఎస్.రామచంద్ర కుమార్, జనసేన పట్టణ అధ్యక్షులు కోటిపల్లి వెంకటేశ్వరరావు, గంట కృష్ణ, పోలిశెట్టి సాంబ, కొప్పాడ అనంత, సంగాని రాజు, రామవరపు శ్రీరామ్, పెమ్మాడి కిరణ్ పాల్గొన్నారు.

సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ

తణుకు : ఎన్‌టిఆర్ ఆరోగ్యశ్రీ వర్తించని కొన్ని రకాల జబ్బులకు సంబంధించి సొంత ఖర్చులతో వైద్యం చేయించుకున్న బాధితులను కూటమి ప్రభుత్వం ఆదుకోవాలనే ఉద్దేశ్యంతో ముఖ్యమంత్రి సహాయ నిధి కింద వారికి ఆర్థిక సహాయం చేసి అండగా నిలుస్తోందని తణుకు ఎంఎల్‌ఎ ఆరిమిల్లి రాధాకృష్ణ అన్నారు. శుక్రవారం తణుకు కూటమి కార్యాలయం లో నియోజకవర్గంలోని 8 మంది బాధితులకు రూ.9.73 లక్షల విలువైన చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా రాధాకృష్ణ మాట్లాడుతూ తణుకు నియోజకవర్గంలో ఇప్పటి వరకు రూ.2.30 కోట్ల మేర చెక్కులను అందజేసినట్లు తెలిపారు. కేవలం 9 నెలల కాలంలోనే ప్రభుత్వం నుంచి సిఫార్సులు లేఖలు ద్వారా పేద, మధ్యతరగతి, దిగువ మధ్యతరగతి వర్గాలను ఆదుకునే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని అన్నారు. రూ.200 కోట్లు పైగా నిధులను బడ్జెట్‌లో కేటాయించి గత 9 నెలల కాలంలో సిఎం సహాయనిధి నుంచి అందజేసినట్లు తెలిపారు. మాజీ మంత్రి కారుమూరి వెంకటనాగేశ్వరరావు స్వగ్రామమైన అత్తిలి పట్టణానికి చెందిన తలారి ప్రసాద్ గత ప్రభుత్వ హయాంలో సిఎం రిలీఫ్ ఫండ్ కోసం దాఖలు చేయలేదని కూటమి ప్రభుత్వం వచ్చాక ప్రసాద్ కుటుంబానికి రూ.5 లక్షలు అందజేసినట్లు ఎంఎల్‌ఎ రాధాకృష్ణ గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు పాల్గొన్నారు.

ఇంటర్‌లో రాష్ట్ర స్థాయి 5వ ర్యాంకర్ కామాక్షికి సత్కారం



విద్యార్థులను సత్కరిస్తున్న యాజమాన్యం

పెనుమంట్ర : ఇంటర్ ఫలితాల్లో ఎంపిసి ఇంగ్లీష్ మీడియంలో రాష్ట్రస్థాయిలో 5వ ర్యాంక్ సాధించిన మండలంలోని ఆంధ్రా అసోసియేషన్(యుకె) జూనియర్ కాలేజీ విద్యార్థిని విఎన్ఎస్ఎల్.కామాక్షిని కళాశాల తరుపున ఘనంగా సన్మానించారు. శుక్రవారం కళాశాల ప్రాంగణంలో పాలకవర్గం, ప్రిన్సిపల్, అధ్యాపకుల ఆధ్వర్యంలో ఇంటర్ ద్వితీయ, ప్రథమ విజేతల అభినందన సభ జరిగింది. ఇటీవల ఫలితాలు వెలువడ్డ ఇంటర్ పబ్లిక్ పరీక్షల్లో జూనియర్, సీనియర్ ఇంటర్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించిన విద్యార్థులకు పుష్పగుచ్ఛాలు, మెమొంటోలు ఇచ్చి ఘనంగా సత్కరించారు. సీనియర్ ఇంటర్‌లో స్టేట్ ఐదవ ర్యాంక్, కళాశాల, మండలం, ఆచంట అసెంబ్లీ నియోజకవర్గం స్థాయిలో ప్రథమ స్థానం సాధించిన విఎన్ఎస్ఎల్.కామాక్షి(ఎంపిసి 988/1000)కి, ద్వితీయ స్థానం సాధించిన జి.హరిత(ఎంపిసి 983/1000)కు, అలాగే సిఇసి గ్రూపులో ప్రథమ స్థానం సాధించిన బి.లక్ష్మీ శ్రేష్ఠ(908/1000), జూనియర్ ఇంటర్ కాలేజీలో ప్రథమ స్థానం సాధించిన కె.కుసుమ(454/470), ఎంపిసి ద్వితీయ స్థానం సాధించిన పి.జ్యోతి శ్రీవల్లి(448/470 ఎంపిసి)లకు, అదేవిధంగా సిఇసి విభాగంలో ప్రథమ స్థానం సాధించిన వి.లోకేష్(435/500)లని సత్కరించి మెమొంటోలు అందించారు. ఈ కార్యక్రమంలో కాలేజీ ప్రెసిడెంట్ డాక్టర్ తేతలి గుర్రెడ్డి, సెక్రెటరీ అండ్ కరస్పాండెంట్ తమనంపూడి రామారెడ్డి, ట్రెజరర్ సత్తి సత్యానంద రెడ్డి, సొసైటీ సభ్యులు, ప్రిన్సిపల్ ఎ.సత్య ప్రకాష్ పాల్గొన్నారు.

నేడు నాగ మాణిక్యం సంస్మరణ సభ

ప్రజాశక్తి - ఆచంట

ఆచంట వేమవరం గ్రామానికి చెందిన సిపిఎం సీనియర్ నాయకురాలు, మహిళా సంఘం నాయకురాలు అల్లం నాగ మాణిక్యం సంస్మరణ సభ శనివారం ఉదయం 10 గంటలకు ఆచంట వేమవరంలో జరుగుతుందని సిపిఎం మండల కార్యదర్శి వి.మోహన్ రావు తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సిపిఎం జిల్లా కార్యదర్శి జెఎన్.వి.గోపాలన్, కార్యదర్శివర్గ సభ్యులు కేతా గోపాలన్‌లు పాల్గొంటారని తెలిపారు. కావున ఈ సంస్మరణ సభకు సిపిఎం నాయకులు, కార్యకర్తలు, శ్రేయోభిలాషులు, అభిమానులు పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

ఉచిత మధుమేహ వ్యాధి నిర్ధారణ పరీక్షలు

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం


షుగర్ పరీక్షలు చేస్తున్న వైద్యులు

అన్ని వయసుల వారిని పట్టి పీడిస్తున్న మహమ్మారి మధుమేహాన్ని దీనిని నియంత్రించుకోవాలని పేరిచర్ల ఫౌండేషన్ ఛైర్పర్సన్ లయన్ పేరిచర్ల మురళీకృష్ణంరాజు అన్నారు. స్థానిక ఆర్అండ్‌బి గ్రౌండ్స్ డైమండ్స్ లయన్స్ క్లబ్ డైరెక్టర్ లయన్ జొన్నల సతీష్ కుమార్ పుట్టినరోజు సందర్భంగా ఏర్పాటు చేసిన డైమండ్స్ లయన్స్ ఉచిత మధుమేహ నిర్ధారణ శిబిరాన్ని శుక్రవారం పేరిచర్ల మురళీ కృష్ణంరాజు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యాయామం, యోగా, నడక లాంటివి చేయాలని, షుగర్ ఉన్నవారు వారి ఆహారపు అలవాట్లు మార్పులు చేసుకుంటూ వైద్యులు చెప్పినవి పాటించాలన్నారు. ఆర్అండ్‌బి వాకర్స్ సభ్యులు మాట్లాడుతూ ప్రతి నెల క్రమం తప్పకుండా పేరిచర్ల ఫౌండేషన్ డైమండ్స్ లయన్స్ వారు ఏర్పాటు చేస్తున్న ఈ ఉచిత షుగర్ క్యాంపు నిర్విరామ అధికారులు, వృద్ధులకు, వాకర్స్‌కు ఎంతగానో ఉపయోగపడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్, వాకర్స్ సభ్యులు పాల్గొన్నారు.

పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

సంఘం గౌరవాధ్యక్షులు ఎం.ఆంజనేయులు డిమాండ్

ప్రజాశక్తి - గణపవరం

పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించి వేతనాలు పెంచాలని ఆసంఘం గౌరవ అధ్యక్షులు ఎం.రామాంజనేయులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం సాయంత్రం గణపవరం బీటి రహదారి భవనంలో జరిగిన పంచాయతీ కార్మికుల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. పంచాయతీ కార్మికులు అనేక జిఒలు ఉన్నప్పటికీ అమలుకు నోచుకోకపోవడం వల్ల తీవ్ర ఇబ్బందులకు పడుతున్నారని అన్నారు. క్లీన్ అండ్ గ్రీన్, స్వచ్ఛ భారత్ అని ముద్దు పేర్లు పెట్టి, పథకాలు పెట్టి మాయమాటలు చెబుతున్న పాలకులు నిరంతరం వీధులు పట్టి వీధులలో చెత్త చెదారాలు లేకుండా చేసి, గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచే పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ఆలోచన ప్రభుత్వాలకు కలగటంలేదని విమర్శించారు. జనాభా పెరిగి గ్రామాలు పెరుగుతున్న ప్రభుత్వం పారిశుధ్య కార్మికులను పెంచకుండా ప్రస్తుతం ఉన్న సిబ్బందితోనే పనులు చేయించటం జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామాల్లో పెరిగిన జనాభా దృష్టిలో పెట్టుకొని వాటర్ కుళాయిలు ఏర్పాటు చేయాలని అన్నారు. దీంతోపాటు వాటర్ ట్యాంకు కెపాసిటీని పెంచి మంచినీరు అందించాలని, లేకపోతే మంచినీరు అందక ప్రజలు ఇబ్బంది పడతారని అన్నారు. పంచాయతీ కార్మికులకు చెప్పులు, కొబ్బరి నూనె, సబ్బులు ఏడాదికి ఒకసారి కూడా ప్రభుత్వం అందించకపోవడం దారుణమని తెలిపారు. జిల్లాలోని ఎక్కువ పంచాయతీలలో ఇవే సమస్యలు కొనసాగుతున్నాయని అన్నారు. వెంటనే కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో మండలంలో ఉన్న పంచాయతీ కార్మికులు పాల్గొన్నారు.

యాచకులకు అన్నదానం

ప్రజాశక్తి - పెనుమంట్ర

మండలంలోని నెగ్గిపూడి గ్రామానికి చెందిన శారదామృత సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో దినదిన జీవనం కోసం యాచిస్తున్న వారిని గుర్తించి వారికి భోజనం అందించే కార్యక్రమం శుక్రవారం మధ్యాహ్నం నిర్వహించారు. కార్యక్రమంలో ట్రస్ట్ ఫౌండర్ డాక్టర్ వి.సత్యసాయి తదితరులు ప్రత్యేకంగా మార్టేరు, పెనుగొండ, వడలి, సిద్ధాంతం గ్రామాలలోని యాచకులను గుర్తించి వారికి స్వయంగా అందించారు. ఈ సేవా యజ్ఞంలో సుమారు 50 మందికి అన్నదానం చేయబడింది. ప్రతి ఒక్కరికి 250 గ్రాముల అన్నం, పప్పు, కూర, పచ్చడి, పెరుగు కలిపిన న్యూట్రిషనల్ ఫుడ్ ప్యాకెట్‌ను అందజేశారు. దీనివల్ల వారి ఆకలిని తీరుస్తూ, మానవత్వాన్ని పరిరక్షించే ప్రయత్నంగా ఈ కార్యక్రమం నిర్వహించినట్లు వారు తెలిపారు.

'ఎస్‌సి వర్గీకరణకు కేబినెట్ ఆమోదం హర్షణీయం'

ప్రజాశక్తి - భీమవరం టౌన్

ఎస్‌సి వర్గీకరణకు క్యాబినెట్ ఆమోదం తెలపడంపై భీమవరం నియోజకవర్గ టిడిపి ఎస్‌సి సెల్ విభాగ నాయకులు హర్షం వ్యక్తంచేశారు. శుక్రవారం భీమవరం టిడిపి పార్టీ కార్యాలయంలో నిర్వహించిన ఎస్‌సి సెల్ సమావేశంలో టిడిపి రాష్ట్ర కోశాధికారి మెంటే పార్థసారథి మాట్లాడుతూ ఎస్‌సి వర్గీకరణకు దశాబ్దాల కాలంగా పోరాటం చేస్తున్న దళితులకు టిడిపి అండగా నిలబడిందన్నారు. ఎస్‌సిలలోని ఉప కులాలను వర్గీకరించి, అందరికీ సమన్యాయం పాటిస్తూ కూటమి ప్రభుత్వం క్యాబినెట్ ఆమోదం తెలపడంపట్ల దళిత ప్రజానీకం హర్షాతిరేకం చేస్తున్నారని అన్నారు. టిడిపి రాష్ట్ర కార్యదర్శి వేండ్ర శ్రీనివాస్ మాట్లాడుతూ ఎస్‌సిలలోని దళిత ఉపకులాలకు రిజర్వేషన్ కల్పించిన ఎపి ప్రభుత్వానికి ఎస్‌సిలందరూ కృతజ్ఞతా భావంతో ఉండాలన్నారు. ఎస్‌సి సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎద్దు ఏసుపాదం, నియోజకవర్గం ఎస్‌సి సెల్ అధ్యక్షులు మాతా సురేష్ బాబు, పట్టణ ఎస్‌సి సెల్ అధ్యక్ష కార్యదర్శులు యర్ర వెంకటేశ్వరరావు, అనపర్తి కృష్ణప్రసాద్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్‌సి సెల్ ప్రధాన కార్యదర్శి బండి రాజేష్, ఎస్‌సి నాయకులు పాల్గొన్నారు.

డ్రెయినేజీ నిర్మాణానికి శంకుస్థాపన

ప్రజాశక్తి - ఆచంట

మండలంలోని పెదమల్లం గ్రామంలో డ్రెయినేజీ నిర్మాణానికి జెడ్‌పిటిసి సభ్యుడు ఉప్పలపాటి సురేష్ బాబు శుక్రవారం శంకుస్థాపన చేసి పనులు ప్రారంభించారు. జిల్లా పరిషత్, గ్రామపంచాయతీ నిధులు రూ.13 లక్షలతో గ్రామంలో డ్రెయినేజీ నిర్మిస్తున్నారు. ఇప్పటి వరకు పెదమల్లం గ్రామంలో డ్రెయినేజీ వ్యవస్థ లేక గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కూటమి ప్రభుత్వం రాకతో గ్రామంలో మొట్టమొదటిసారిగా డ్రెయినేజీ నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. కార్యక్రమంలో ఎంపిపి దిగుమర్తి సూర్యకుమారి, సర్పంచి దిర్సాల విజయలక్ష్మి, సిద్ధాంతం డిసి ఛైర్మన్ తమ్మినీడి ప్రసాద్, టిడిపి మండల అధ్యక్షుడు కేతా వీరయ్య, పార్టీ సీనియర్ నాయకులు వీర నరసింహమూర్తి, టిడిపి నాయకులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

మే 20న దేశవ్యాప్త సమ్మె జయప్రదం చేయాలి

ప్రజాశక్తి - పాలకొల్లు

మే 20న జరిగే దేశవ్యాప్త కార్మిక సమ్మెను జయప్రదం చేయాలని సిఐటియు నాయకులు జవ్వాది శ్రీనివాసరావు కోరారు. శుక్రవారం సంఘ కార్యాలయం వద్ద సమ్మె బుక్లెట్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ కార్మికులు అనేక పోరాటాల ద్వారా సాధించుకున్న చట్టాలు పెట్టుబడి దారుల ప్రయోజనం కోసం లేబర్ కోడ్‌లుగా మార్చడం సరైంది కాదన్నారు. ఇది కార్మికుల హక్కులు హరించి దోపిడీ చేయడమేనని అన్నారు. లేబర్ కోడ్‌లను రద్దు చేసి చట్టాలను కొనసాగించాలని కోరారు. ఇందుకు మే 20న జరిగే సమ్మెలో కార్మిక, ఉద్యోగులు పెద్ద ఎత్తున పాల్గొని కార్మిక ఐక్యతను చాటాలని పిలుపునిచ్చారు. గుబ్బల సత్యనారాయణ అధ్యక్షతన జరిగిన సమావేశంలో అనంతరం జరిగిన బుక్లెట్ విడుదల కార్యక్రమంలో వేగి రత్తయ్య, తాడి వెంకటేష్, ఆకుల ప్రసాద్, వీరపల్లి సత్యనారాయణ, తమ్మా సూర్యారావులు పాల్గొన్నారు.

క్షీరా రామలింగేశ్వర స్వామి ఆలయం సందర్శన

ప్రజాశక్తి - పాలకొల్లు

పాలకొల్లు పట్టణంలో వేంచేసియున్న క్షీరా రామలింగేశ్వర స్వామి వారిని తూ.గో జిల్లా కొత్తపేట ఆర్‌డిఒ శ్రీకర్, రామచంద్రపురం ఆర్‌డిఒ అఖిల శుక్రవారం దర్శించుకున్నారు. వీరికి ప్రధాన పూజారులు ఆశీర్వచనం చేసి తీర్థ ప్రసాదాలు, స్వామివారి ఫోటో అందజేశారు. ఆలయ కార్యనిర్వాహణాధికారి ముచర్ల శ్రీనివాస్, సూపరింటెండెంట్ వాసు తదితరులు వీరితో పాటు పాల్గొన్నారు.

1.650 కేజీల గంజాయి పట్టివేత

ఉండి : మండలంలోని ఉప్పుగుంట ప్రాంతంలో కేజీ 650 గ్రాముల గంజాయిని ఉండి పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ సందర్భంగా ఉండి ఎస్‌ఐ మహమ్మద్ నసీరుల్లా మాట్లాడుతూ ఉండి శివారు ప్రాంతం ఉప్పుగుంటలో గంజాయి అక్రమ రవాణా జరుగుతుందని సమాచారంతో రెక్కి నిర్వహించగా అనుమానాస్పద స్థితిలో ఉన్న 11 మంది వ్యక్తులను అదుపులోకి తీసుకొని వారి వద్ద నుంచి 1.650 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకొని, వారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

ప్రతిభా పాటవ పోటీల విజేతలకు బహుమతులు అందజేత


విజేతలకు బహుమతులు అందజేస్తున్న నిర్వాహకులు

పాలకొల్లు : పాలకొల్లు విద్యా చైతన్య సమాఖ్య ఆధ్వర్యంలో ఫిబ్రవరి 23న జరిగిన 7, 9వ తరగతుల ప్రతిభా పాటవ పరీక్ష, వ్యాసరచన పోటీల్లో విజేతలైన విద్యార్థులకు బహుమతి ప్రధానోత్సవం శుక్రవారం పాలకొల్లు ఎంఎంకెఎన్‌ఎంఎం స్కూల్‌లో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన కాకినాడ క్రియా సంస్థ కార్యదర్శి ఎస్‌ఎస్ఆర్ జగన్నాథరావు మాట్లాడుతూ విద్యార్థులు తమ జీవితంలో ఐదవ తరగతిలో నవోదయ, ఎనిమిదవ తరగతిలో ఎన్ఎంఎంఎస్ పరీక్ష, అలాగే పాలిటెక్నిక్ పరీక్షలు రాయాలని, దాని ద్వారా మన స్థాయితో పాటు మనకు తర్వాత ఉన్న తరగతుల్లో అది ఎంతో ఉపయోగపడుతుందని అన్నారు. అలాగే తమ సంస్థ ఆధ్వర్యంలో పెద్దాపురంలో నడుస్తున్న సందర్శించాలని దాని ద్వారా విద్యార్థులు సొంతంగా ఎవరికి వాళ్లు ప్రయోగాలు చేసుకోవచ్చని, వారి పాఠ్యాంశాలలో గల ప్రయోగాలను అక్కడ చేసి చూపెడతామన్నారు. పాలకొల్లు లాంటి ప్రాంతంలో కూడా విద్యార్థుల సమాఖ్య ఆధ్వర్యంలో ప్లాంట్స్ పండుగలా నిర్వహించాలని కోరారు. దానికి తమ సంస్థ తోడ్పాటు అందిస్తుందని తెలిపారు. సమాజంలో సమాఖ్య అధ్యక్షులు మెరుగ శ్రీనుబాబు మాట్లాడుతూ ఈ సంవత్సరం ఈ ప్రతిభాపాటవ పరీక్షకు సంబంధించి సుమారు రూ.60 వేలు అందజేస్తున్నట్లు తెలియజేశారు. మొదటి పది స్థానాల్లో నిలిచిన విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్నామన్నారు. ఏడవ తరగతిలో 18 మంది, 9వ తరగతిలో 14 మంది వ్యాసరచనలో ముగ్గురు విజేతలుగా నిలిచారన్నారు. వారందరికీ కూడా నగదు బహుమతులతో పాటు జ్ఞాపికలు, ప్రశంసా పత్రాలు అందజేశారు. రాయకుదురు హైస్కూల్ ప్లస్ హెచ్ఎం కానుకొలను శ్రీనివాసరావు, ఎంఎంకెఎన్ఎంహెచ్ హెచ్ఎం పితాని ధర్మారావు విద్యార్థులను అభినందించారు. వారికి ప్రశంసా పత్రాలు అందజేశారు. మంచెం కనకరాజు కార్యక్రమానికి స్వాగతం పలకగా చేగొండి కరుణ కుమార్ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమాన్ని సంస్థ కార్యదర్శి పోలిశెట్టి శ్రీశ్రీ, ఉపాధ్యక్షులు కింజారపు దుర్గాప్రసాద్, సభ్యులు ఉమామహేశ్వరరావు, వంగా కరుణకుమార్, డివివి.ప్రసాద్ పర్యవేక్షించారు.

నేడు ఆచంటలో స్వర్ణాంధ్ర-స్వచ్ఛ ఆంధ్ర ర్యాలీ

ఆచంట : శనివారం ఉదయం 10 గంటలకు స్వర్ణాంధ్ర-స్వచ్ఛ ఆంధ్ర ర్యాలీ ఆచంట స్టేట్ బ్యాంకు వద్ద నుంచి ఆచంట సెంటర్ మీదుగా వయా సాయిబాబా గుడి రైతు సంఘ భవనం హై స్కూల్ మీదుగా మండల పరిషత్ కార్యాలయం వరకు నిర్వహిస్తున్నట్లు ఎంపిడిఒ పూర్ణ బాబ్జి శుక్రవారం విలేకరులకు తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎంఎల్ఎ పితాని సత్యనారాయణ ర్యాలీలో పాల్గొంటారని అన్నారు. కావున మండలంలోని అన్ని పంచాయతీ కార్యదర్శులు, పంచాయతీ సిబ్బంది, సచివాలయ సిబ్బంది విధిగా హాజరై విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి, డివిజనల్ పంచాయతీ అధికారులు పాల్గొంటారని తెలిపారు. అనంతరం మండల పరిషత్ కార్యాలయం వద్ద ఈ-కంటైనర్ స్టాల్ ప్రారంభోత్సవం కార్యక్రమం జరుగుతుందన్నారు.

గ్రంథాలయానికి కుర్చీల బహూకరణ

ప్రజాశక్తి - ఆచంట



కుర్చీలు అందజేస్తున్న మానవత సభ్యులు

పుస్తకాల ద్వారానే విజ్ఞానాన్ని పెంపొందించుకోవచ్చని మానవత స్వచ్ఛంద సేవా సంస్థ మండల అధ్యక్షులు కుక్క లీలప్రసాద్ అన్నారు. ఆచంట సెంటర్లోని శాఖ గ్రంథాలయంలో పాఠకుల సౌకర్యార్థమై దాతల సహకారంతో 14 కుర్చీలను లైబ్రేరియన్ సమక్షంలో శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా లీల ప్రసాద్ మాట్లాడుతూ అన్ని సౌకర్యాలతో కూడిన లైబ్రరీ ఉంటే పాఠకుల సంఖ్య పెరుగుతుందని, అదేవిధంగా జ్ఞాన సముపార్జనకు పుస్తక పఠనం ఎంతో ఉపయోగపడుతుందని అన్నారు. అనంతరం 2024-25 మానవత జిల్లా డైరెక్టర్‌ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సంస్థ గౌరవ డైరెక్టర్ కొల్లేపర వెంకన్న బాబు, సలహా సంఘం కో ఛైర్మన్ వేండ్ర శ్రీనివాస్, సభ్యులు సజ్జా నారాయణ, ఆత్మీయ సహకార కమిటీ సభ్యులు కొమ్మనపెద్ది శర్మ, సభ్యులు కొలుకులూరి సత్యనారాయణ, అభివృద్ధి కమిటీ ఛైర్మన్ గుండాబత్తుల ఆనంద్ కుమార్, సంస్థ కోశాధికారి తమ్మినీడి సత్యనారాయణమూర్తి, సభ్యులు వైట్ల శ్రీనివాస్, సభ్యులు, పాఠకులు మన్నె భాస్కరరావు, గ్రంథాలయం అధ్యాపకులు పాల్గొన్నారు.

పెట్రోల్ బంకులు, గ్యాస్ గొడౌన్‌లో అగ్నిమాపక వారోత్సవాలు

ప్రజాశక్తి - నరసాపురం

అగ్నిమాపక వారోత్సవాలలో భాగంగా అయిదవ రోజున శుక్రవారం నరసాపురం కేంద్ర అగ్నిమాపక సిబ్బంది పట్టణంలోని భారత్ గ్యాస్ గోడౌన్, ఇతర పెట్రోల్ బంకుల్లో పనిచేస్తున్న సిబ్బందికి, యాజమాన్యానికి అగ్నిప్రమాదాలు సంభవించినప్పుడు తీసుకోవలసిన జాగ్రత్తలను వివరించారు. అనంతరం వారు పనిచేసే పరిసరాలలో ఉండే ఫైర్ పరికరాలు ఉపయోగించి అగ్నిప్రమాదం సంభవించినప్పుడు ఏవిధంగా అగ్నిప్రమాదాలు నియంత్రించాలో డెమో ద్వారా చేసి చూపించారు. అగ్నిప్రమాదాల నివారణను వివరించే పాంప్లెట్స్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నరసాపురం కేంద్ర అగ్నిమాపక అధికారి కె.భాస్కర్ రామమ్, ఫైర్ సిబ్బంది, గ్యాస్ గోడౌన్, సిబ్బంది పాల్గొన్నారు.


మినీ ఎత్తిపోతల పథకాన్ని ప్రారంభిస్తున్న కాంట్రాక్టర్ వెంకటేశ్వరరావు

మినీ ఎత్తిపోతల పథకం ప్రారంభం

ప్రజాశక్తి - మొగల్తూరు

మండలంలోని కొత్తపాలెం గ్రామంలో గొంతేరు డ్రైన్ వద్ద ఏర్పాటుచేసిన మినీ ఎత్తిపోతల పథకాన్ని శుక్రవారం ప్రారంభించారు. గ్రామానికి చెందిన కాంట్రాక్టర్ లోకం వెంకటేశ్వరరావు రైతుల భాగస్వామ్యంతో సుమారు రూ.ఐదు లక్షలతో ఎత్తిపోతల పథకాన్ని ఏర్పాటు చేశారు. జిన్నూరు కాలువకి శివారుని ఉన్న కొత్తపాలెం గ్రామానికి సాగునీరు సక్రమంగా అందుతుంది. దీంతో ఆక్వా చెరువులకు, వ్యవసాయానికి నీటి ఇబ్బందులు తలెత్తవు. ఆ సమస్యల పరిష్కారానికి సమైక్యంగా మినీ ఎత్తిపోతల పథకాన్ని ఏర్పాటు చేశారు.

క్రైస్తవుల రక్షణకు పటిష్ట ఏర్పాట్లు

పరిశీలించిన ఆర్‌డిఒ దాసిరాజు

ప్రజాశక్తి - మొగల్తూరు

మండలంలోని పేరుపాలెం బీచ్‌లో బీచ్‌కు వచ్చే క్రైస్తవుల రక్షణకు పటిష్ట ఏర్పాట్లు చేశారు. ఈ సందర్భంగా ఆర్‌డిఒ దాసిరాజు, శిక్షణ డిఎస్‌పి కె.మానస బీచ్‌ను సందర్శించి ఏర్పాట్లను పరిశీలించారు. సిబ్బందికి పలు సూచనలు చేశారు. బీచ్‌లో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా బందోబస్తు నిర్వహించాలని అన్నారు. వారి వెంట సిఐ దుర్గాప్రసాద్, తహశీల్దార్ కె.రాజకిషోర్, ఎస్ఐ జి.వాసు, పలు శాఖల సిబ్బంది ఉన్నారు.

కాలువల అభివృద్ధికి కృషి అభినందనీయం

డిప్యూటీ స్పీకర్, ఉండి ఎంఎల్ఎ కనుమూరు రఘురామకృష్ణరాజు

ప్రజాశక్తి - కాళ్ల


విరాళం అందజేస్తున్న రవివర్మ

కాలువలను అభివృద్ధి చేసేందుకు రవివర్మ తన వంతు సాయం అందించేందుకు కృషి చేయడం అభినందనీయమని డిప్యూటీ స్పీకర్, ఉండి ఎంఎల్ఎ కనుమూరు రఘురామకృష్ణ రాజు పేర్కొన్నారు. శుక్రవారం ఏలూరుపాడులో ఆయనకు రైతు కార్యాచరణ సమితి రాష్ట్ర ఉపాధ్యక్షులు మంతెన వెంకటరవివర్మ లక్ష రూపాయల విరాళం అందజేశారు. ఏలూరుపాడు గ్రామానికి చెందిన రవివర్మ మంతెన వెంకట నార్యనారాయణరాజు, సుబ్రహ్మణ్య ఫౌండేషన్ తరఫున లక్ష రూపాయల చెక్‌ను రఘురామకృష్ణ రాజుకు అందజేశారు. మంతెన వెంకట రవివర్మ ఉండి ఇరిగేషన్ ఫండ్ పేరిట కలెక్టర్‌తో అకౌంట్ ఓపెన్ చేయించి, లక్షరూపాయల చెక్‌ను జమ చేశారు. ఆయన వెంట ఏలూరుపాడు సర్పంచి భూపతిరాజు వెంకట జగ్గరాజు, మాజీ సర్పంచి మంతెన ఆంజనేయరాజు పాల్గొన్నారు.

ఉపాధి హామీ సమస్యలపై ధర్నాను జయప్రదం చేయాలి

వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి మూడి మోజేష్

పోడూరు : ఉపాధి హామీ సమస్యల పరిష్కారానికి ఈనెల 22వ తేదీన భీమవరం కలెక్టరేట్ వద్ద జరిగే మహాధర్నాను జయప్రదం చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి మూడి మోజేష్, అధ్యక్షులు తరపట్ల పద్మ పిలుపునిచ్చారు. శుక్రవారం ఇరువురు విలేకరులతో మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తెచ్చిన రెండు పూటల పని విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఆన్లైన్ మస్తరు విధానాన్ని రద్దు చేసి, బకాయి వేతనాలను వడ్డీతో కలిపి ఇవ్వాలన్నారు. ఉపాధి హామీకి బడ్జెట్లో నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. సమ్మర్ అలవెన్స్ కొనసాగించాలన్నారు. టెక్నికల్ అసిస్టెంట్ వికరణ పత్రం రద్దు చేయాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పి-4లో భూ పంపిణీ చేయాలన్నారు. జిల్లాల్లో అనర్హుల చేతిలో ఉన్న ప్రభుత్వ భూములను స్వాధీనం చేసుకోవాలన్నారు. వంద రోజులు పనిచేసిన ప్రతి కూలీ కుటుంబానికి పనిముట్లు, టెంట్ ఇవ్వాలన్నారు. కుటుంబానికి రెండు వందల రోజులు పని కల్పించి, రోజుకి కూలి రూ.600 చొప్పున వేతనం ఇవ్వాలన్నారు. ఉపాధి మేట్లకు ఐదు రూపాయల పారితోషికం అమలు చేయాలన్నారు. సెల్‌ఫోను మంజూరు చేయాలన్నారు. క్షేత్రస్థాయిలో ఫీల్డ్ అసిస్టెంట్లు, గ్రూప్ మేట్స్‌పైన స్థానిక రాజకీయ నాయకుల వేధింపులు ఆపాలన్నారు. పే స్లిప్‌లు, జాబ్‌కార్డులు, పోస్ట్ ఆఫీస్ ద్వారా వేతనాలు ఇవ్వాలని, డెల్టా ప్రాంతం కావడం వల్ల పంటబోదెలు, గుర్రపు డెక్క, తూడు తొలగింపు పనులను కొనసాగించాలని, పట్టణ ప్రాంతాల్లో ఉపాధి హామీ చట్టంలో పనులు చేపట్టాలని డిమాండ్ చేశారు.

రన్‌ఫర్ జీసస్‌ను విజయవంతం చేయాలి : ఎంఎల్ఎ

నరసాపురం : రన్ ఫర్ జీసస్‌ను విజయవంతం చేయాలని ప్రభుత్వ విప్, ఎంఎల్ఎ బొమ్మిడి నాయకర్ అన్నారు. పట్టణంలోని జనసేన పార్టీ కార్యాలయంలో శుక్రవారం రాత్రి ఎంఎల్ఎ బొమ్మిడి నాయకర్ రన్ ఫర్ జీసస్ 10కె రన్ మారథన్ క్యాప్స్, టీ షర్ట్స్ రిలీజ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 14 ఏళ్లుగా రన్‌ఫర్ జీసస్ కార్యక్రమాన్ని నిర్వహించడం అభినందనీయమన్నారు. అనంతరం యునైటెడ్ పాస్టర్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ బి.రత్నరాజు, పాస్టర్, ఎల్డర్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ సిహెచ్.జాన్ బాబు, యంగ్ పాస్టర్స్ ఫెలోషిప్ ప్రెసిడెంట్ కెకె.డేనియల్ రాజు మాట్లాడుతూ రాబోయే ఈస్టర్ ముందు రోజు ప్రతి యేడు నరసాపురంలో 14 ఏళ్లుగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈనెల 19న శనివారం ఉదయం 6 గంటలకు థామస్ బ్రిడ్జి నుంచి ప్రారంభమై టాక్సీస్టాండ్, స్టీమర్ రోడ్, వలందర్ రేవు, వైఎన్.కాలేజీ, పంజాసెంటర్, మిషన్ హైస్కూల్ రోడ్, గవర్నమెంట్ హాస్పటల్, ఒఎన్ జిసి, మొగల్తూరు రోడ్, మిషన్ హాస్పటల్ మీదుగా థామస్ బ్రిడ్జి వద్ద ముగుస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఆరాధన టివి, రన్‌ఫర్ జీసెస్ కో-ఆర్డినేటర్ టి.సంజయ్ కిషన్, వై.రూబెన్, కాకిలేటి డేనియల్ రాజు, ఎండ్ పాత్రాజు, గుమ్మపు శ్యాం పాల్గొన్నారు.

పలుచోట్ల గుడ్ ఫ్రైడే వేడుకలు

ప్రజాశక్తి - ఆచంట

మానవాళి పాపాలను పరిహరించేందుకు ఆ రాజాధిరాజు నిందలు భరించారని క్రీస్తు ప్రార్థనా మందిరం సువార్తకులు గాదిరాజు తిమోతి రాజ అన్నారు. మండలంలో శుక్రవారం క్రైస్తవులు భక్తిశ్రద్ధలతో గుడ్ ఫ్రైడే వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా క్రైస్తవులు ప్రార్థన మందిరాల్లో క్రీస్తు గీతాలు ఆలపిస్తూ ఉపవాస ప్రార్థనలు చేశారు. మండలంలో ఆచంట, కొడమంచిలి, పెదమల్లం, కోడేరు, కరుగోరిమిల్లి, కందరవల్లి, భీమలాపురం, వల్లూరు, అయోధ్య లంక, పెనుమంచిలి, ఆచంట వేమవరం, శేషమ్మ చెరువు గ్రామాల్లో క్రైస్తవ విశ్వాసులు భక్తిశ్రద్ధలతో గుడ్ ఫ్రైడే వేడుకలు జరుపుకున్నారు.

పెనుమంట్ర : మండలంలోని ఆలమూరు, పొలమూరు, మాముడూరు, పెనుమంట్ర, గరువు, మార్టేరు తదితర గ్రామాల్లోని పలు సంఘాల చర్చిల్లో శుభ ప్రార్థనలు జరిగాయి. ఈ సందర్భంగా నెగ్గిపూడి గ్రామంలోని కోడేరు రోడ్డులో ఉన్న పరిశుద్ధ మత్తయి లూథరన్ దేవాలయంలో పాస్టర్లు పి.క్రిస్టఫర్, సరిపల్లి సూర్య ప్రకాష్, నల్లి శ్రీనివాస్, తాడి నరసింహామూర్తి, సబ్బితి సల్మాన్, పమ్మి చంద్రరావు, నెల్లి సువర్ణరాజు, వర్షాల పౌల్ సుధాకర్రావు, సాక రవి ఆధ్వర్యంలో ప్రార్థనలు జరిగాయి. అధికసంఖ్యలో విశ్వాసులు పాల్గొన్నారు.


మొగల్తూరులో..

కాళ్ల : క్రైస్తవులు శుక్రవారం గుడ్ ఫ్రైడేని పవిత్ర దినముగా గుర్తిస్తారని ఇహెచ్‌హెచ్ చర్చి పాస్టర్ ఎండి ఇస్మాయిల్ అన్నారు. శుక్రవారం మండలంలోని పలు ప్రార్థనా మందిరాల్లో గుడ్ ఫ్రైడే నిర్వహించారు. మండలంలోని వివిధ గ్రామాల సంఘస్తులు భక్తిశ్రద్ధలతో ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

పాలకొల్లు : గుడ్ ఫ్రైడే సందర్భంగా క్రైస్తవ విశ్వాసులు శుక్రవారం పాలకొల్లు పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. విద్యుత్ శాఖ కార్యాలయం వద్ద గల చర్చి నుంచి శిలువలను పట్టుకుని ప్రదర్శన నిర్వహించారు. అనంతరం ఏసుక్రీస్తును స్మరించుకుంటూ చర్చిలలో ప్రార్థనలు నిర్వహించారు. మత ప్రభోదకులు ఏసుకు శిలువ వేయడానికి గల కారణాలను తెలియజేస్తూ సందేశాలు ఇచ్చారు.

తాడేపల్లిగూడెం : స్థానిక రైల్వే స్టేషన్ రోడ్డులో వున్న క్రైస్ట్ సెంటినరీ లూథరన్ చర్చిలో మహా శుక్రవారం సిలువ ధ్యానమును క్రైస్తవ విశ్వాసులు ఎంతో భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. యేసుక్రీస్తు సిలువలో పలికిన ఏడు మాటలను జాన్ ఇర్విన్ పాలపర్తి(ఆర్‌డిఒ,కడప) వర్తమానం అందించారు. క్రీస్తు గీతాలు ఆలపించారు. బైబిల్‌లో యేసుక్రీస్తు పలికిన ఏడు మాటలు చదివి ప్రార్థనలు చేశారు. ఈ సిలువ ధ్యానంలో గురుమండల అధ్యక్షులు రెవ. డిఎల్ ఫినేహాస్ అడిషనల్ పాస్టర్ వి.రత్నాకర్, పాలకవర్గ సభ్యులు రత్నరాజు, నామాల రాజు, స్త్రీల సమాజం, యూత్, సండే స్కూల్ పిల్లలు, క్రైస్తవ సోదరులు పాల్గొన్నారు. స్థానిక సెయింట్ మదర్ వన్నినీ చర్చ్ విశ్వాసులు శుక్రవారం తాడేపల్లిగూడెం పట్టణంలో సిలువతో ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీ తాడేపల్లిగూడెం బస్టాండ్ నుంచి పెద్ద తాడేపల్లి సమీపంలోని మధర్వని చర్చి వరకు సాగింది. ఈ ర్యాలీలో విశ్వాసులు భారీగా హాజరయ్యారు. ఈ సందర్భంగా చర్చి వద్ద నిర్వాహకులు రెవరెండ్ ప్రొఫెసర్ జోసెఫ్ అర్జున్, రెవరెండ్ పాస్టర్ ప్రేమ్‌కుమార్‌లు క్రీస్తు సందేశాన్ని వివరించారు. అనంతరం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.

మొగల్తూరు : మండలంలోని గ్రామాలలో క్రైస్తవులు గుడ్ ఫ్రైడే వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మొగల్తూరులోని ఆర్‌సిఎం చర్చి రెవ ఫాదర్ అయినపర్తి పీటర్ ఆధ్వర్యంలో క్రైస్తవులు భారీ ప్రదర్శన చేశారు. స్థానిక గాంధీ బొమ్మ సెంటర్ ప్రాంతంలో క్రీస్తు సందేశాన్ని ఫాదర్ వినిపించారు.

నరసాపురం : గుడ్ ఫ్రైడే సందర్భంగా నరసాపురం పట్టణంలోని మిషన్ హై స్కూల్ రోడ్‌లో ఉన్న ఆర్‌సిఎం చర్చి వారు ఘనంగా నిర్వహించారు. సిలువ మోసే కార్యక్రమంలో ప్రభుత్వ విప్, ఎంఎల్ఎ బొమ్మిడి నాయకర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన స్వయంగా సిలువ మోశారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ బొమ్మిడి నాయకర్ నియోజకవర్గ ప్రజలకు, రాష్ట్ర ప్రజలందరికీ గుడ్ ఫ్రైడే శుభాకాంక్షలు తెలియజేశారు. క్రీస్తు ప్రభువు ప్రేమను, త్యాగాన్ని గుర్తు చేసుకునే ఈ పవిత్ర దినోత్సవం అందరికి శాంతిని, సత్సంకల్పాన్ని కలిగించాలనే ఆకాంక్షను వ్యక్తపరిచారు. ఈ కార్యక్రమంలో ఘంటా కృష్ణ, మైలా వసంత రావు, కోటి పాల్గొన్నారు.


నరసాపురంలో శిలువను మోస్తున్న ఎంఎల్ఎ నాయకర్

పెనుగొండ : మండలంలోని చర్చిల్లో ఉదయం నుంచి ప్రార్థనలు నిర్వహించారు. పవిత్రమైన గుడ్ ఫ్రైడే సందర్భంగా చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. పెనుగొండ రాజుగూడెం పాస్టర్ బాబు రాజేంద్రప్రసాద్ నిర్వహించారు. ఆయన ఈ సందర్భంగా మాట్లాడుతూ సహోదరుల పట్ల ప్రేమానురాగాలు పంచుకోవాలని, ఓర్పు సహనం కలిగి ఉండాలని, క్రీస్తు బోధనలు వివరించారు. గుడ్ ఫ్రైడేను ఘనంగా జరుపుకున్నారు.